## కొనసాగుతున్న ఏనుగుల దాడులు

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** పులిచెర్ల మండలంలో గతకొద్ది నెలలుగా వ్యవసాయ పంటలపై ఏనుగుల దాడులు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీలో రైతులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డిలకు చెందిన వరి

పంటను తొక్కుకుంటూ వెళ్లి ధ్వంసం చేశాయి. ఎంతో కష్టనష్టాలు పడి పండించిన పంటలపై ఏనుగులు దాడి చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. నష్టపోయిన రైతులకు చెందిన పంటలను అటవీ శాఖ సిబ్బంది పరిశీలించి నష్టపరిహారం అందేలా చేస్తామని చెప్పారు.

# ముంచుతున్న మొంథా..

### కృష్ణాపురం జలాశయం పరిశీలించిన జిల్లా ప్రత్యేక అధికారి



**ప్రజాశక్తి- కార్వేటినగరం :** కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం జలాశయంను మొంథా తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారి పిఎస్ గణేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులు ఏఈ టీఎస్ భాస్కర్ రాజీవ్‌ను జలాశయం పూర్తి సామర్థ్యం ఎంత, డ్యాంకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తుందని అడిగి తెలుసుకున్నారు. పెనుమూరు మండలం వెదురుకుప్పం మండలాల నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా వస్తుందని ఏఈ తెలిపారు. గత నాలుగు రోజులుగా పూర్తిస్థాయిలో డ్యాం నీటితో నిండడంతో గేట్లు ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి గిరీష మాట్లాడుతూ మొంథా తుపాన్ ప్రభావంతో కృష్ణరాజపురం జలాశయంకు వచ్చే వర్షపు నీరును వృధా కాకుండా నీరును నిల్వ చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుకు సామర్థ్యం 0.199 టీఎంసీలు నీరు నిల్వ, ఆయకట్టు 6125 ఎకరాలు సాగునీరు అందజేయడం జరుగుతోందని ఇంజనీర్లు వివరించారు. ఈ నెలలో డాం ఏడుసార్లు నిండినది,7 సార్లు దిగువకు నీరు విడుదల చేయడమైనదని వివరించారు. నగరి ఆర్డీవో అనుపమ, తహశీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఏఈ టీఎస్ భాస్కర్ రాజీవ్, డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్, ఏవో విద్యావతి, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్, డ్యాం చైర్మన్ మునికృష్ణ, సురేష్ వర్మ పాల్గొన్నారు.

**ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు.. సురక్ష ప్రాంతాలకు తరలింపు**

మండల పరిధిలోని కోటర్వేడు దళితవాడలో మొంథా తుపాన్‌కు భారీగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లల్లోకి నీళ్లు రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు తెలియపరిచారు. మంగళవారం వీఆర్వో బాబురెడ్డి బాధితులను మూడురోజులకు సరిపడే భోజన సదుపాయాలు కల్పించారు. అనంతరం మండల తహశీల్దార్ నాగరాజుకు విషయం తెలియజేసి ప్రజలను సురక్ష ప్రాంతానికి తరలిస్తామన్నారు. సర్పంచ్ షిలా రాణి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### కుశస్థలి నదిలో వరద తీవ్రతను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**విజయపురం:** మండలంలోని మొంథా తుఫాన్ తీవ్రతతో మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం వీడలేదు. మండలంలో తహసీల్దార్ కిరణ్ విజయపురం, మహారాజపురం ప్రాంతాలను, ఎంపీడీవో రాజేంద్ర ఎంపీడీవో ఇళ్ళత్తూరు కుశస్థలి నది వరద ఉధృతిని, ఆర్ అండ్‌బి జేఈ నర్సింహులు నగరి - కనకమ్మసత్రం రోడ్డును, ఒరూరు, గొల్లకండ్రిగ, క్రూరికాపురం ప్రాంతాలను పరిశీలించి కల్వర్లు మంజూరు చేస్తామన్నారు. ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ పన్నూరు చెరువుకట్టను పరిశీలించారు. మండలంలోని శ్రీ హరిపురం ఉన్నత పాఠశాలలో ప్రహరి నేల కొరిగింది. మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐకి ప్రిన్సిపాల్ అధికారికంగా సెలవు మంజూరు చేయకపోవడంతో కొందరు విద్యార్థులు కళాశాల వద్దకు వచ్చి వెనుదిరిగారు. అధ్యాపకులు అవస్థలు పడుతూ కళాశాలకు వచ్చారు. కేవీపురంలో పూరి గుడిసె నేలకూలడంలో హౌసింగ్ ఏఈ ఏళుమలై సందర్శించి సహాయక చర్యలు చేపడతామన్నారు. నీట మునిగిన పంటలను మండల వ్యవసాయాధికారి రజినీకుమారి బృందం అంచనా వేస్తున్నారు. మండలంలో 40 చెరువులలో సుమారు 28 చెరువులకు పైగా మొరవ పారుతున్నాయి. కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి పరందామన్, మహిళా పోలీసు పలువురు ఉన్నారు.

కుశస్థలి నదిని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేంద్ర

**ప్రజలు ఇళ్లకు పరిమితం కావాలి**

**మొంథా తుపాన్ జిల్లా ప్రత్యేక అధికారి పిఎస్.గిరీషా**

**నగరి:** మొంథా తుపాన్ ప్రభావంతో నగరి, విజయపురం, నిండ్ర ప్రాంతాలలో అధిక వర్షపాతం నమోదు అవుతున్నదని, 29వ తేదీ మధ్యాహ్నం వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని, ప్రజలు ఇళ్లకు పరిమితం కావాలని జిల్లా ప్రత్యేక అధికారి పిఎస్.గిరీషా తెలిపారు. మంగళవారం తుపాను ప్రభావ ప్రాంతాల పరిశీలనలో భాగంగా నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీలపట్టు బ్రిడ్జిని జిల్లా ప్రత్యేక అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జిల్లాలో తుపాను ప్రభావంతో నగరి, విజయపురం, నిండ్ర మండలాలలో అధికంగా 15 నుండి 20 మి.మీల వర్షపాతం నమోదైనదని తెలిపారు. తుపాను వలన నష్టాలు కలుగకుండా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం తరపున సహాయ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. దాదాపు 50 చెరువులలో నీరు మొరవ పారుతున్నదని, ఇరిగేషన్ శాఖ ద్వారా ఇందులో 10 చెరువులకు మరమ్మతులు చేపట్టడం జరిగిందని, మిగిలినవి వర్షపాతం తగ్గిన అనంతరం చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కల్వర్టుల వద్ద నీరు అధికంగా పారుతున్న ప్రదేశాలలో బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బంది ద్వారా పర్యవేక్షించడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో నగరి ఆర్డీవో అనుపమ, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎమ్మార్వో రవికుమార్, ఇరిగేషన్ శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**నుంజర్ల ప్రాజెక్టును పరిశీలించిన తహశీల్దార్**

**యాదమరి:** గత మూడు రోజులు ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో మండల పరిధిలోని భూమిరెడ్డిపల్లి గ్రామంలోని నుంజర్ల ప్రాజెక్టును యాదమరి తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వీరేంద్ర మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపడుతున్నారు. తెల్లరాళ్లపల్లి గ్రామపంచాయతీ సంపంగి నెల్లూరు ప్రజలు తాగునీటి బోరు మరమ్మతులు చేపట్టాలని తహశీల్దార్‌కి విన్నవించారు. వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని పూర్తిస్థాయిలో నిండిన చెరువులను పరిశీలించారు. పూర్తిస్థాయిలో నిండిన చెరువులు వాగులు వద్ద పిల్లలు,పెద్దలు ఎవరు వెళ్లకూడదని ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల అభివృద్ధి అధికారి వీరేంద్ర, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉషారాణి పాల్గొన్నారు.

ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎంపీడీవో

## కుంగిన యాదగుంట చెరువు కట్ట

### సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

**ప్రజాశక్తి- వి కోట:** మండల పరిధిలోని బైరుపల్లి పంచాయతీ యాదకంట చెరువు గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిగా నిండడంతో కట్ట మధ్య భాగంలో మంగళవారం కుంగింది. రాత్రి కురిసిన వర్షానికి చెరువుకట్ట మధ్యభాగంలో కుంగి దిగువనున్న ఆయకట్టు పొలాల్లోకి మట్టి పడింది. కుంగిన చెరువుకట్ట నుంచి నీరు దిగువకు లీక్ అవుతుండడంతో చెరువుకట్ట ఎక్కడ తెగిపోతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రధాన రహదారి నుండి యాదగుంట గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గుత్తేదారులు అవగాహన లేక కట్టకు దిగువనున్న రివీట్ మెంట్ తొలగించి కొత్తగా మట్టి వేసి రోడ్డును ఏర్పాటు చేశారు. సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కట్ట వైపు నీరు పొంగడంతో కట్టపై మధ్యభాగంలో వేసిన తారు రోడ్డు బీటలు వారింది. వర్షం ఇలాగే కొనసాగితే కట్టకు గండిపడి తెగే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి కట్టకు గండిపడకుండా తగు చర్యలు చేపట్టారు. చెరువులో ఉన్న నీటిమట్టన్ని తగ్గించేందుకు ఓవైపు మరవ వద్ద లోతు చేసి నీటిని తగ్గించేందుకు ఎక్సలేటర్లుతో పనులు చేపట్టారు. అదేవిధంగా కట్ట ఎప్పుడు తెగుతుందోనన్న అనుమానం ఉండడంతో కట్టపై రాకపోకలను పూర్తిగా నిషేధించారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు నీటి లీకేజీని అరికట్టేందుకు ట్రాక్టర్లతో మట్టిని తరలించి చర్యలు చేపట్టారు. ప్రమాద స్థలాన్ని తహశీల్దార్ ఉదయ్ సంతోష్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సిఐ సోమశేఖర్ రెడ్డి, ఏఈ స్వప్న పరిశీలించారు.

కుంగిన యాదకుంట చెరువు కట్ట

## ఆళ్ళమడుగు చెరువుకు గండి

### పరిశీలించిన తహశీల్దార్, ఎంపిడిఓ

**ప్రజాశక్తి- సోమల:** సోమల మండలం తమ్మినాయునిపల్లి పంచాయతీ పేగలవారిపల్లికి ఎగువన ఉన్న ఆళ్ళమడుగు చెరువుకు గండి పడిందన్న విషయం తెలుసుకున్న తహశీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో జివిఎస్‌వి.ప్రసాద్ సిబ్బందితో కలిసి వెళ్లి స్థానిక నాయకులతో మాట్లాడి జెసిబి, ట్రాక్టర్లను ఉపయోగించి మట్టిని తోలి గండిని పూడ్చివేశారు. పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, విఆర్ఓ రెడ్డమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

గండి పడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## సమస్యలకు నిలయాలు
# సంక్షేమ వసతి గృహాలు

- కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు
- చలికి వణుకుతున్న విద్యార్థులు
- వర్షాకాలంలోనూ చన్నీటి స్నానాలు
- హాస్టల్ చుట్టూ అధ్వానంగా పారిశుద్ధ్యం

పెచ్చులూడిన మరుగుదొడ్డి పైకప్పు

**ప్రజాశక్తి -కుప్పం**

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నారు. వీటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. పేద విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు విద్యలో మెలకువలు పాటించి, ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన వసతి గృహాలు నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాయి.

వసతి గృహం ఎదుట పశువులు

**కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు**

కుప్పం పట్టణం మునుస్వామిపురంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లు పక్కపక్కనే ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బిసి హాస్టల్లో 23 మంది విద్యార్థులు ఉండగా ఎస్సీ హాస్టల్లో 45 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు భవనాలు దాదాపు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేకమార్లు ఈ భవనాలను మరమ్మతులు చేయగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు బిసి హాస్టల్ బాత్రూంల పైకప్పు పెచ్చులూడి కింద పడింది. దీనికి తోడు విద్యార్థులు పడుకునే గదులకు సంబంధించి కిటికీలకు తలుపులు, మస్కిటో మెస్సులు లేకపోవడంతో దోమల బాధతోపాటు విద్యార్థులు చలికి వణుకుతున్నారు.

**హాస్టల్ చుట్టూ పారిశుద్ధ్యం అధ్వానం**

ఎస్సీ, బీసీ హాస్టళ్లు పక్కపక్కనే ఉండగా రెండు హాస్టళ్లలో దాదాపు 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే హాస్టల్ భవనాల చుట్టూ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో ఈ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు తరచూ అనారోగ్యాల బారినపడి ఆసుపత్రి పాలవుతున్నారు. హాస్టల్ భవనాల ఎదుట ఆవులు, మేకలు, గొర్రెలను కట్టేస్తుండడంతో ఈ ప్రాంగణమంతా కంపు కొడుతోంది.

**బీసీ హాస్టల్ విద్యార్థులను ఎస్సీ హాస్టల్‌కు తరలింపు**

బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉండగా బాత్రూం పైకప్పులు ఇప్పటికే పెచ్చులూడి కింద పడింది. హాస్టల్ కాంపౌండ్ వాల్ సైతం ఓవైపు కూలిపోగా ఎప్పుడు భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బీసీ హాస్టల్లో ఉంటున్న 23 మంది విద్యార్థులను పక్కనే ఉన్న ఎస్సీ హాస్టల్‌కు తరలించారు. ఎస్సీ హాస్టల్ భవనం సైతం అనేకమార్లు మరమ్మతులు చేసినదే. ఈ భవనంలోని గదులకు కూడా కిటికీలకు తలుపులు, మెస్సులు లేకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చలి తీవ్రత, దోమలు అధికంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

అధ్వానంగా ఉన్న వసతి గృహం ఆవరణం

## నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించండి

### పక్కాగా పారిశుధ్య కార్యక్రమాలు: కమిషనర్

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నీటిసరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి నీటి సరఫరా, పారిశుద్ధ్యం, రోడ్ల విస్తరణ, లోతట్టు ప్రాంతాల్లో తాజా పరిస్థితిపై తనిఖీలు చేపట్టారు. నీటి సరఫరా పైపులైన్లను తనిఖీలు చేయాలని, లీకేజీ లేకుండా చూడాలన్నారు. క్లోరిలేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. గిరింపేటలో సబ్ జైల్ వద్ద సంపులో నీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం కట్టమంచి - సాంబయ్య కండ్రిగ రోడ్డును పరిశీలించారు. గాంధీ రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు అందించారు. అనంతరం లిల్లీ బ్రిడ్జి, సంతపేట లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున పారిశుద్ధ్యం మెరుగ్గా ఉంచాలన్నారు. వీధుల్లో ఎక్కడా వ్యర్థాల నిల్వలు లేకుండా తొలగించాలని, బ్లీచింగ్ చల్లాలన్నారు. ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

## సంజీవని హెల్త్ కేర్ ప్రాజెక్టుపై అవగాహన



**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** వైద్య ఆరోగ్యశాఖ ద్వారా త్వరలో నిర్వహించబోతున్న సంజీవని హెల్త్ కేర్ ప్రాజెక్టు (డిఐఎస్‌సి)పై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవంబర్ 3న జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సాయంకాలం 4నుంచి 6 గంటల వరకు డాక్టర్లకు, మోనిటరింగ్‌సెల్ వారికి ఈ సంజీవనపై ట్రైనింగ్ ఇస్తారని తెలిపారు. మొదటగా డిఎంహెచ్ఓ కొంతమంది గ్రూప్ ఎంఎల్ హెచ్‌పి సెలెక్ట్ చేసి కలెక్టర్‌కి పంపుతారని, తిరిగి కలెక్టర్ ఫైనల్ చేసిన లిస్టు వారికి డిఐఎస్‌సి ద్వారా ఫిజికల్ ట్రైనింగ్ ఇప్పిస్తారన్నారు. కుప్పంలో ఆల్రెడీ డిఐఎస్‌సి ద్వారా ప్రజలకు సేవలు చేస్తున్నందున అందులో గర్భిణీ స్త్రీలకు, ఎన్సీడి పేషెంట్స్‌కు, దీర్ఘకాలిక వ్యాధుల వారికి, ఇంకా క్వాలిటీగా సేవలు అందించి ఇంప్రూవ్ చేయాలన్నారు. నవంబర్ నెలలో ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఎమ్మెల్ హెచ్ పిలు అందరికీ తిరిగి వీటిపై ట్రైనింగ్ ఇస్తారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనుష, డాక్టర్ గిరి పాల్గొన్నారు.

## అన్ని విధాల సిద్ధంగా ఉన్నాం..

### జల వనరుల సంక్షేమ శాఖ ఎస్ ఈ వెంకటేశ్వరరాజు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ఎదుర్కొనేందుకు జలవనరుల సంక్షేమశాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నట్లు జల వనరుల సంరక్షణ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరాజు తెలిపారు. చిత్తూరు జిల్లాలో కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలు సందర్భంగా ఇరిగేషన్ శాఖ చేపడుతున్న చర్యలపై ఆయన మాట్లాడారు. వర్షాల సందర్భంగా జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, మేజర్, మైనర్ చెరువుల వద్ద జల వనరుల సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలోని ఎన్టీఆర్ జలాశయం, కృష్ణాపురం రిజర్వాయర్ల పూర్తిస్థాయిలో నిండడంతో నీటిని దిగువకు వదలడం జరుగుతుందన్నారు. వరద నీటితో చెరువులు జలకలను సంతరించుకున్నాయని తెలిపారు. సప్లై ఛానల్‌లను వర్షాలకు ముందే మరమ్మతులు చేయడం ద్వారా వర్షపు నీరు చెరువుల్లోకి చేరుతోందని వర్షపు నీరుతో చెరువులు జలకల సంతరించుకున్న అన్నారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా చెరువుల వద్ద జల వనరుల సంరక్షణ శాఖ అధికారులు 24 గంటలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

## చెరువు కట్టకు శాశ్వత పరిష్కారం చూపాలి

### అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు**

గండి పడిన ఆత్మకూరు చెరువు కట్టకు శాశ్వత పరిష్కారం చేయాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షానికి మిట్ట హరిజనవాడ గ్రామంలో ఉన్న ఆత్మకూరు చెరువుకట్టకు గండి పడింది దీంతో మంగళవారం ఎమ్మెల్యే చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. తుపాన్ కారణంగా మండలంలోని ముక్కళతూరు గ్రామంలో నివాసముంటున్న రాజేశ్వరి పూరిగుడిసె పడిపోవడంతో వారిని పరామర్శించి రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. తుపాన్ కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పంచాయతీరాజ్ డీఈ ఆనంద్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో మనోహర్ గౌడ్, విద్యుత్ శాఖ ఏఈలు వరదరాజులు, తనిగవేలు, సర్వేర్ వాసు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర సాయం..

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :** తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా ఇబ్బందులు పడే ప్రజలకు సత్వరమే సాయం అందించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, టిడిపి నాయకులు వేగంగా స్పందిస్తున్నారు. మంగళవారం చిత్తూరు నగరపాలక పరిధిలో 27వ వార్డు చామంతిపురం, వినాయకపురంలో రెండు ఇళ్ల గోడలు కూలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు స్థానిక నాయకులతో కలిసి గోడలు కూలిపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. వారికి నిత్యవసరాలను అందించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు. తేనెబండ వద్ద నీవా నదిలో నీటిప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్పొరేటర్ ఇందు, నగర అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, నాయకులు దయాల్, రేఖ, రాము పాల్గొన్నారు.

### కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వేధింపులు

## కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** కమర్షియల్ టాక్స్ జాయింట్ కలెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి నాలుగవ తరగతి ఉద్యోగులను ఇష్టానుసారం దూషిస్తూ వేధిస్తున్నారంటూ కమర్షియల్ టాక్స్ ఉద్యోగులు మంగళవారం స్థానిక కట్టమంచి రోడ్డులోని కమర్షియల్ టాక్స్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. వీరి పోరాటానికి ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు జేఏసీ నాయకులు కేవీ రాఘవులు, ఏపీ ఉద్యోగుల సంఘం నాయకులు శివయ్య, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు వినాయక కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలియజేశారు. కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల సంఘం నాయకులు పూర్ణ, ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు రాఘవులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వీరేంద్రనాథరెడ్డి ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ బూతులు తిడుతున్నాడని, కులం పేరుతో కూడా దూషించడం జరిగిందన్నారు. భరత్, లవ కుమార్ అనే నాలుగో తరగతి ఉద్యోగులపై అనోచితంగా ప్రవర్తిస్తూ కులం పేరుతో దూషించడంతోపాటు దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉద్యోగుల సంఘం నాయకులు కమర్షియల్ టాక్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు, కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగులు

## యువకుడిపై అడవి పంది దాడి

**ప్రజాశక్తి- వి కోట**

మండల పరిధిలోని ముదరందొడ్డి పంచాయతీ మద్దిమాకులపల్లి గ్రామ సమీపంలోని పొలాల వద్ద పశువులను మేపేందుకు వెళ్లిన ఓ యువకుడుపై అడవి పంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిమాకులపల్లికి చెందిన సుధాకర్ కుమారుడు శరత్ (25)మంగళవారం మధ్యాహ్నం అడవి సమీపంలోని పొలాల వద్ద పాడిపశువును తీసుకెళ్తుండగా ఉన్నఫలంగా చెట్లపొదల్లో దాక్కున్న అడవి పంది అతనిపై దాడి పాల్పడింది. అతని మీదికి ఒక్కసారిగా దూకి కొరికి పొడిచి పలుచోట్ల గాయపరిచింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బాధితున్ని వీకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శరత్

## పల్లె వెలుగు బస్సులు ఢీ

### 24 మందికి గాయాలు

**ప్రజాశక్తి- పుంగనూరు :** ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను తప్పించబోయి ఎదురెదురుగా వస్తున్న రెండు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో 24 మంది ప్రయాణికులకి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి నుండి పలమనేరుకు, పలమనేరు నుండి పుంగనూరుకు వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు గూడూరుపల్లి సమీపంలోని పిచ్చిగుండ్లపల్లి మలుపు వద్ద రెండు బస్సులు ఢీకొన్నాయి. రాంపల్లి నుండి బట్టందొడ్డికి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పిచ్చి గుండ్లపల్లి మలుపు వద్ద ట్రాక్టర్ వెళ్లగా పలమనేరు వైపు నుండి పుంగనూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఓవర్ టెక్ చేయడంతో ప్రమాదం జరిగింది. రెండు పల్లె వెలుగు బస్సులు పలమనేరు డిపోకి చెందినవి. ఈప్రమాదంలో 24 మంది గాయాలయ్యాయి. ప్రయాణికులలో పలమనేరు నుంచి విధుల కోసం వస్తున్న ఏఎస్ఐ అశ్వత్ నారాయణకు కూడా స్వల్పగాయాలు అయ్యాయి. వీరిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా తరలించి ప్రథమ చికిత్స అందించారు. ప్రమాదంలో పట్టణానికి చెందిన ఆఫీస్ ఖాన్, నాగమణి, ఎర్రగుంట్లపల్లికి చెందిన వెంకటరమణ, కేసిపల్లికు చెందిన రమణ, ఆర్టీసీ డ్రైవర్ శ్రీధర్‌లను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న పలమనేరు ఆర్డీవో భవాని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని గాయపడిన వారిని పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో బస్సులు రెండు ముందు భాగంలో పూర్తిగా దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బకాయిలు చెల్లించండి

మామిడి రైతు సంఘం వినతి

**ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపుల నిర్వాహకులు కిలోకు 8 చొప్పున చెల్లించాల్సిన బకాయిలు సత్వరం చెల్లించాలని లేకుంటే ఉద్యమం తీవ్ర తరం చేయాలని మామిడి రైతు సంఘం కార్యవర్గం తీర్మానించింది. చిత్తూరు ఎస్‌టియు కార్యాలయంలో టి జనార్ధన్ అధ్యక్షతన మంగళవారం కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను చేసింది. ప్రభుత్వం తొలుత ఇచ్చిన ప్రకటన మేరకు రూ.12 లో, రూ.8కి ద్వితీయ ప్రాధాన్యత ఇవ్వడం తీవ్ర అభ్యంతరకరమని రైతు ప్రయోజనం దెబ్బ తీసిందని కార్యవర్గం అభిప్రాయపడింది. ప్రభుత్వమే చిత్తశుద్ధి ఉంటే మొదట సిండికేట్ మోడల వంటి రైతుల అకౌంట్లో రూ.8 చొప్పున జమ చేసి ఉండే వారిని పేర్కొంది. మామిడి రైతుల ఆక్రందన సభ ముందు రోజున రూ.4 చొప్పున ప్రభుత్వ ప్రోత్సాహకం రూ.170 కోట్లు విడుదల చేయడం హర్షదాయకమేనని భావించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 40 వేల మంది రైతులకు ఇంకా రూ.300 కోట్లు పైగా ఫ్యాక్టరీలు, రాంపుల నుండి చెల్లింపులు జరగాలని వీటికి ప్రభుత్వమే కఠిన చర్యలు తీసుకుని విడుదల చేసేలా కృషి చేయాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే మామిడి సరఫరా చేసి ఐదు నెలలు కావస్తున్న వేతనాల్లో రైతులు అప్పుల బారినపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. తొలుత ప్రభుత్వంతో జరిగిన సమావేశంలో రూ.12 కు సమ్మతించి తర్వాత నాలుగు రూపాయలు సబ్సిడీ అందిన నేపథ్యంలో సైతం ఎనిమిది రూపాయలు చెల్లించడానికి కూడా సిండికేట్ సనేమిరా అనడం వీరిపై ప్రభుత్వ నియంత్రణ లేనట్టుగా భావించాల్సి వస్తుందని కమిటీ అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం 40 వేల మంది రైతుల క్షేమం కోసం కఠినంగా వ్యవహరించి వారి నుండి రైతుల అకౌంట్లో డబ్బు జమ చేసేలా చూడాలని కోరింది. లేకుంటే నవంబరు చివరివారంలో ఉద్యమం తీరతరం చేయాల్సి వస్తుందని పేర్కొంది. కార్పొరేట్ సామాజిక

సమావేశమైన అఖిలపక్ష రైతు సంఘం నాయకులు

బాధ్యత, 54 వ సెక్షన్ ప్రకారం గుజ్జు యజమానులకు ఎందుకు ప్రయోజనంతో రైతాంగానికి తెలిపారు. ప్రభుత్వ దివాళాకోరు తనంగా భావించకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ సమావేశం లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, టి. జనార్దన్, సి మునీశ్వర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్. కెసురేంద్రన్, ఉపాధ్యక్షులు, పి. హేమలత, కె. మునిరత్నం నాయుడు, బి మురళి, ఎ. ఉమాపతి నాయుడు, కార్యదర్శులు, శ్రీనివాస్, త్యాగరాజులరెడ్డి, ఎల్ మోహన్ రెడ్డి, కోశాధికారి, ఎల్ సంజీవ్ రెడ్డి లు పాల్గొన్నారు.

ఎంపీపీని కలిసిన ఎంఈవో జనార్ధన్‌రెడ్డి

## ఎంపీపీని కలిసిన ఎంఈఓ

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** మండల విద్యా అధికారి (ఎంఈఓ1)గా నూతనంగా బాధ్యతలు స్వీక రించిన జనార్ధన్ రెడ్డి మంగళవారం మండల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మండల ఉపాధ్యాయులు ఎంపిపి మొగసాల రెడ్డెప్పను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంఈఓ జనార్ధన్‌రెడ్డికి ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపి విద్యా రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు తోడ్పడాలని ఆకాంక్షించారు.

## తుపానుపై అవగాహనా సదస్సు

తుపానుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీర్థం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు దాసర్లపల్లిలో మొంథా తుపాన్‌పై ప్రజలకు మంగళ వారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కాంతమ్మ మాట్లాడుతూ 'తుపాన్ ప్రభావం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం వుందని, అందువల్ల నీటిని కాచిన తరువాత వడకట్టి తాగాలని సూచించారు. వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు బయటకు రావద్దని, కరెంట్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాత ఇళ్లలో, చెట్ల వద్ద లేదా విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లవద్దని చెప్పారు. ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆస్పత్రిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నవీన్, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు రామాంజీనమ్మ, మునిలక్ష్మమ్మ పాల్గొన్నారు.

## అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

**ప్రజాశక్తి-కుప్పం:** అభివృద్ధి కార్యక్ర మాలకు ప్రజలు సహకరించాలని కడ అడ్వ యిజరీ కమిటీ సభ్యుడు రాజ్ కుమా ర్, టిడిపి కుప్పం మున్సిపల్ అధ్యక్షులు వెంకటేష్ పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో మంగళవారం డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. రోడ్డు విస్తరణ గురించి స్థానికులతో చర్చించారు. త్వరలోనే కుప్పం మున్సిపాల్టీ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మారుతుందని, రాష్ట్రానికి ఆదర్శ మున్సిపాలిటీగా కుప్పంలో తీర్చిదిద్దేందుకు పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ మాణిక్యం , రాజేష్, కమల్ పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించండి

**ప్రజాశక్తి-పలమనేరు:** చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గంటా ఊరు, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ వాసులు తమకు మౌలిక వసతులైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తాము ఇల్లు నిర్మించుకొని దాదాపు 20 ఏళ్లైనా మౌలిక వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. వర్షాల వల్ల మోకాళ్ల లోతు బురద ఏర్పడి ఆటోలు సైతం రావడం లేదని వాపోయారు. వెంటనే తమకు రోడ్లు వేయాలని కమిషనర్ రమణారెడ్డిని కోరారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతానికి తుపాను సమస్య తీవ్రంగా ఉన్నందువల్ల తాత్కాలికంగా జెసిబి సహాయంతో కాలువల పూడికతీత రోడ్లలో బురదను తొలగించడం చేయిస్తున్నామని తర్వాత రాబోవు రోజుల్లోఎమ్మెల్యే అమర్నాథరెడ్డి తో సంప్రదించి కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేయిస్తామని తెలపడంతో కాలనీవాసులు వెనుదిరిరిగారు. పలమనేరు మున్సిపాలిటీ గంటావూరు, ఇందిరమ్మ కాలనీ, బిసీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పర్యటన

బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :** గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ విఎం థామస్ మంగళవారం తుపాన్ సైతం లెక్కచేయకుండా మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలం లోని పెద్ద తయ్యూరు హరిజనవాడలో మొంథా తుపాన్ కారణంగా ఇల్లు కోల్పోయిన విజయమ్మకు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ప్రభుత్వం తరపున 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు పొంగిపోర్లుతున్న వాగులను వంకలను పరిశీలించారు. ప్రజలకు సూచనలు చేశారు . అనంతరం జిఎంఆర్ పురం పంచాయతీ వడ్డీ కండ్రిగలో ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం సమావేశం ఏర్పాటు చేసి స్థానిక ప్రజల నుంచి పీజిఆర్ఎస్ అర్జీలను స్వీకరించారు. అనంతరం గడ్డ మహరాజపురంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు వారి వద్ద నుంచి అర్జీలను తీసుకున్నారు. తుపాన్ పట్ల అధికారుల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూడాలని అధికారులు ఆదేశించారు. ప్రజలు రైతులు ఇలా పరిస్థితులలో ధన నష్టం జంతు నష్టం ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు లోకనాథపిళ్ళై, ఏవో మోహన్ మురళీ మండల స్థాయి నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు గంధం నేని జయశంకర్ నాయుడు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ గంధమనేని రాజశేఖర్ నాయుడు టిడిపి నాయకులు తయ్యూరు నాగరాజు, భాస్కర్ నాయుడు, దశరథ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ అసిస్టెంట్

## వ్యాధులపై అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి- రామకుప్పం:** విద్యార్థులు, ప్రజలు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పూజిత పేర్కొన్నారు. మండలంలోని విజలాపురం కేజీబీవీ హాస్టల్‌లో మంగళవారం విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మాత్రలు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు కాచిన నీటిని చల్లార్చిన తరువాత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న పోలీసులు

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి: సీఐ

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని సిఐ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం అమర వీరుల పోలీసుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పలమనేరు ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బంగారుపాలెం మండల యువకులు పలువురు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన యువకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్‌టీసీ ఉద్యోగికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-కుప్పం:** కుప్పం ఆర్టీసీ డిపోలో లీడింగ్ హ్యాండ్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్కె బాష అనా రోగ్యం తో బాధ పడు తుండగా ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం డిపో సిబ్బంది లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తోటి ఉద్యోగిని ఆదుకు నేందుకు ఆర్టీసీ ఉద్యోగులు ముందుకు రావడంపై ఆర్‌టిసి వైస్ చైర్మన్ మునిరత్నం అభినందిస్తూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్కె బాషా కుటుంబ సభ్యులకు లక్ష రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ టికె స్వామి, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు సుగుణమ్మ, ఆర్టీసీ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలి: టిడిపి

**ప్రజాశక్తి-కుప్పం:** కుప్పం మండలం చెక్కు నత్తం పంచాయతీ అడవి ములకలపల్లి గ్రామంలో మంగళవారం యూనివర్సిటీ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఒకసారి రక్త పరీక్ష చేసుకుంటే 47 రకాల రిపోర్ట్స్ ఇస్తారని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారని అందులో భాగంగా యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కనకరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 31న ప్రమాణ స్వీకారోత్సవం

పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ముమ్మర ఏర్పాట్లు

**ప్రజాశక్తి- పలమనేరు:** చిత్తూరు జిల్లా పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఆ మేరకు స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో జరగనున్న సభ స్థలాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్నతో పాటు వ్యవసాయ అధికారులు, స్థానిక టిడిపి నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ నెల 31న ప్రమాణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించ నున్నామని నియోజకవర్గం నుంచే గాక జిల్లా నుంచి సైతం పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేయనున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అందులో భాగంగా భారీ భహిరంగ సభా ప్రాంగణంతో పాటు పెద్ద ఎత్తున భోజన ఏర్పాట్లను చేపట్టనుండడంతో అనువైన స్థలాలను ఎంపిక చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రతి ఒక్కరు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చైర్మన్ రాజన్న కోరారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, బయప్పగారి పల్లి సింగిల్ విండో చైర్మన్ వెంకటముని రెడ్డి, ఏఎంసి సెక్రటరీ సంజీవ్, నాయకులు రెడ్డి శేఖర్,గిరిధర్ గోపాల్, అశోక్ పాల్గొన్నారు.

## కాణిపాకంలో అతిథి గృహం, రెండు కల్యాణ మండపాలు నిర్మాణం

### టిటిడి పాలక మండలిలో తీర్మానం

**ప్రజాశక్తి -ఐరాల:** కాణిపాక వరసిద్ధి వినాయక దేవ స్థానం అభివృద్ధికి తిరు మల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి మంగళవారం నిర్వహించిన సమావేశంలో చర్చించారు. టిటిడి సహాయ, సహకారాలతో కాణిపాకం దేవస్థానం లో ఒక అతిథి గృహం, రెండు కల్యాణ మండపాలు నిర్మించేందుకు 25 కోట్ల రూపాయల వ్యయాన్ని టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు మంజూరు చేస్తూ ప్రకటించారు. దీనికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌కి, టీటీడీ ఈవో, అదనపు ఈవోకు దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీహరి జవహర్‌లాల్, దేవదాయ శాఖ కమిషన్ రామచంద్ర మోహన్‌కు, కాణిపాకం దేవస్థానం చైర్మన్ మణి నాయుడు కు, సహకరించిన స్థానిక నాయకులకి, ప్రజాప్రతినిధులకు కాణిపాక ఆలయ ఈవో పెంచల కిషోర్ ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థినుల ప్రతిభ

పరుగు పోటీలో ఉత్తమ ప్రతిభ చూపిన కీర్తన

**ప్రజాశక్తి-తవణంపల్లి:** గంగవరం విద్యార్థినులు క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. ఇటీవల చిత్తూరు జిల్లా జివిఎస్ ఫామ్‌లో ఈ నెల 7వ తేదీ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో పాఠశాల విద్యార్థిని బి కీర్తన 200 మీటర్ల పరుగులో రెండవ స్థానం సాధించింది. మరో విద్యార్థిని బివి ఇందు గ్రీష్మ హైజంప్ విభాగంలో మూడవ స్థానం సాధించింది. వారి విజయాలతో పాఠశాల సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి రోహిణి, తరగతి ఉపాధ్యాయురాలు ఎస్ సరసమ్మ, వ్యాయమ ఉపాధ్యాయు రాలు పీడీ అక్తర్ విద్యార్థినులను అభినందిం చారు. జిల్లా స్థాయిలో రాణించిన బి కీర్తన రాష్ట్ర స్థాయి అండర్-19 అథ్లెటిక్స్ 200 మీటర్ల ఈవెంట్‌కు ఎంపికైంది. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబర్ 21వ తేదీ నుండి 24 వరకు పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని పదవేజీ (మహాదేవి) ఏపిఆర్ఎస్ బాలుర గురుకులంలో నిర్వహిం చారు. ఈ పోటీలలో కీర్తన అద్భుతంగా రాణించి నాల్గవ స్థానం సాధించింది. తన విజయంపై స్పందించిన కీర్తన మాట్లాడుతూ తవణం పల్లె మండలం, మాధవరం పంచాయతీ ఏం బోయపల్లె లోని సామాన్య, మధ్య తరగతి రైతు కుటుం బానికి చెందిన తాను తన తల్లి దండ్రులు వ్యవ సాయంపై ఆధారపడి జీవిస్తు న్నార న్నారు. వారి ఆదాయం తోనే తాను చదువుకుంటు న్నా నని వారు ఇచ్చిన ప్రోత్సా హం, గురువు ల మార్గదర్శ కతే తన విజయానికి కారణమని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థినుల విజయాన్ని పురస్కరిం చుకుని పాఠశాల తరపున ప్రత్యేక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు టి రోహిణి మాట్లాడుతూ తమ విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర స్థాయిలలో రాణించడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. కీర్తన లాంటి విద్యార్థులు కష్టపడి ముందుకు సాగి పాఠశాలకు మరింత పేరు తేవాలని కోరుకుంటున్నానని తెలిపారు.

## పరిష్కారం ఏది?

- మండల సమావేశంలో సమస్యలపై చర్చ
- వివిధ శాఖల అధికారులు గైర్హాజరు
- నోటీసులు జారీ చేస్తామన్న ఎంపీడీవో

**ప్రజాశక్తి -శాంతిపురం:** 'మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం ఏది?' అని పలువురు ప్రజా ప్రతి నిధులు అధికారులను ప్రశ్నించారు. శాంతిపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వసుంధర కోదండ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రజా ప్రతినిధులు వారి పరిధిలోని ప్రజా సమస్యలు ప్రస్తా వించారు. ముఖ్యంగా గుంజార్లపల్లి సర్పంచ్ విజయ రామిరెడ్డి మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు, హార్టికల్చర్, పాడి రైతులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 121 పెద్దూరు ఎంపీటీసీ రవి, మర్సనపల్లి ఎంపీటీసీ ఆర్ముగం, 64 పెద్దూరు సర్పంచ్ పలు సమస్యలు పరిష్కరించాలని అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీవో కుమార్ మాటా

సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

డుతూ మండల సమావేశంలో సభ్యులు లేవనెత్తిన విషయాలపై వారం రోజుల్లోపు సమా ధానం ఇవ్వాలని అధికారు లకు సూచిం చారు. ఈ కార్యక్రమా నికి గైర్హాజరైన అధికారు లపై క్రమ శిక్షణ చర్యల కింద నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పట్టాభి, సింగిల్ విండో చైర్మన్ గోపాల్, తహశీల్దారు ప్రకాష్, పలు శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదానం

**ప్రజాశక్తి -పలమనేరు:** చిత్తూరు జిల్లా పలమనేరు స్థానిక ఏరియా ఆస్పత్రిలో పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పలమనేరు పోలీసు డివిజన్ పోలీసుల రక్తదాన శిబిరం ఈనెల 21వ తేదీ నుండి నిర్వహిస్తున్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో పలమనేరు సిఐ మురళీమోహన్, గంగవరం సీఐ ప్రసాద్ పలమనేరు ఎస్ఐ లోకేష్ రెడ్డి, బంగారుపాళ్యం ఎస్ఐ కత్తి శ్రీనివాసులు, పలమనేరు డివిజన్ ఇతర పోలీస్ సిబ్బంది మొత్తం కలిపి 60 మంది రక్త దానం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి డేగల ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల లా అండ్ ఆర్డర్‌ను పరిరక్షిస్తూనే అమరవీరుల త్యాగ ఫలాలను స్మరించుకుంటూ రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ రక్త దానం వల్ల ఎంతోమంది ప్రమాదాల్లో గాయపడిన వారు ప్రసవ సమయంలో గర్భిణుల ప్రాణాలను కాపాడ గలిగిన వారవు తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిం డెండెంట్ మమతారాణి , డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది, బ్లడ్ బ్యాంకు సిబ్బంది, ప్రయోగశాల సిబ్బంది, ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు నాగరాజు, సుధాకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

### పశువైద్యాధికారిణి చందన ప్రియ

**ప్రజాశక్తి-సోమల:** ముంథా తుపాన్ సమయంలో పశు వులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమల హరిజన వాడలో సోమల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస నాయుడు , మండల పశు వైద్యాధికారి చందన ప్రియ రైతులకు వర్షాలు ,వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. పశువులు జీవాల షెడ్లను గాలి వానలకు కూలిపోకుండా ముందుగానే మరమ్మతులు చేపట్టాలి, పశు వులకు జీవాలకు నత్తల నివారణ మందులు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. విష సర్పాల నుంచి కాపాడుకోవాలి. ఎత్తైన ప్రాంతాల్లో పశువులను, జీవాలను ఉంచాలి. వరదల సమయంలో పశువులను వంకలకు సమీపంలో కట్టి వేయకూడదు. లేగ దూడలకు చలి బారిన పడకుండా వెచ్చని వాతావరణం కల్పించాలి. అవసరాలు కనుగుణంగా పశువుల దాణా మేతను నిల్వ ఉంచుకోవాలి. విద్యుత్ తీగలకూ మరియు స్తంభాలకు దూరంగా ఉంచాలి. పశు వులకి ఎక్కడైనా ప్రాణ నష్టం కలిగిన వెంటనే పశు వైద్య సిబ్బందికి తెలపాలని సూచిం చారు. పశువులు ఏదైనా వ్యాధి బారిన పడితే వెంటనే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది లైవ్ స్టాక్ అసిస్టెంట్ శివకుమార్ ,రవితేజ ,సురేంద్ర సుధాకర రైతులు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహంలో వర్షపు నీరు

మున్సిపల్ అధికారుల చొరవతో తొలగింపు

**ప్రజాశక్తి-పలమనేరు:** పలమనేరు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి విపరీతంగా వర్షం చేరి పెద్ద మడుగులా మారినది. ఈ వర్షపు నీరు వసతి గృహం లోపల వంటగది ఆనుకొని దాదాపు ఐదు అడుగుల లోతు మేర నిలిచిపోయింది. దీంతో మూడు రోజులుగా పిల్లలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేత పట్టుకుని గడుపుతున్నారు. ఈ విషయమై బిసిఎఫ్ రాష్ట్ర నాయకుడు అద్దంకి రమణమూర్తి వసతి గృహాన్ని సందర్శించి అధికారులపై మండి పడ్డారు. స్థానిక వసతి గృహం వార్డెన్ సోమశేఖర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ శివుడు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం సాయంత్రం మునిసిపల్ అధికారులు జెసిబి సాయంతో హాస్టల్ పక్కనే వున్న చెరువులోకి కాలువ తీసి నీటిని బయటకు పంపారు. ఈ వసతి గృహంలో దాదాపు 132 మంది బాలురు

బాలుర వసతి గృహ ఆవరణలో చేరిన వర్షపు నీరు

చదువుకుంటూ వసతి పొందుతున్నారు. శనివారం సాయంత్రం పడిన భారీ వర్షానికి వసతి గృహం ఆవరణలో ఒక పెద్ద చెట్టు కూడా విరిగి పడిపోయింది. ఆ చెట్టును కూడా తొలగించాల్సి వుంది. సంబంధిత అధికారులు తుపాను దృష్ట్యా అప్రమత్తతో ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

## వరిపంట రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి -పుంగనూరు:**

మొంథా తుపానుతో వరి పంట నష్ట పోకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వర్షపు నీటిని పంట పొలాల నుండి బయటకు వెల్లేలా ముందే పొలం గట్లను కొంత మేర కట్ చేసి వుంచితే పంట పొలం నుండి నిలిచి ఉన్న నీటిని బయటకు పంపి నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. నీటిలో మునిగిన వరి కోసం, ధాన్యాలు మొలకెత్తకుండా రక్షణకు అదనపు నీటిని తీసివేసిన తర్వాత ఐదు శాతం సాధారణ ఉప్పు ద్రావణాన్ని (ఒక లీటరు నీటిలో 50 గ్రాముల సాధారణ ఉప్పు) చల్లుకుంటే ధాన్యం మొలకెత్తకుండా ధాన్యం రంగు మారకుండా నిరోధిస్తుందన్నారు. నీరు తోటలో ఆగితే వెంటనే తీసివేయాలని ఉద్యాన శాఖ అధికారి వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూరగాయల పంటలలో ముఖ్యంగా టమాటాలో బాక్టీరియా ఆకు మచ్చలు ఉధృతి ఉంటే ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు ం కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వేరు కుళ్లు నివారణకు కార్బెండజిమ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లు దగ్గర పోయాలని సూచించారు. కాకర, బీర పంటలలో బూజు తెగులు నివారణకు రిడోమిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. నత్తల నివారణకు నత్తలను ఉప్పు నీటిలో వేయడం, మెటల్డిహైడ్ గుళికలు (2 కేజీలు ఒక ఎకరాకు ) , గోనెసంచులను ఉప్పు ద్రావణంలో ముంచి అక్కడక్కడా పెట్టడం, కలుపు మొక్కలను తీసివేయాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే బూస్టర్ డోస్ లు వేయడం, 19 19:19 లు వేయడం , 13:0:43 5 గ్రాములు స్ప్రే చేయాలని సూచించారు.

# క్రైం న్యూస్

### బాలిక కిడ్నాప్ కేసు

## నిందితుడికి 20 ఏళ్ల శిక్ష

### పోక్సో కోర్టు సంచలన తీర్పు

**ప్రజాశక్తి -పుంగనూరు, చిత్తూరు అర్బన్:** ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ మంగళవారం చిత్తూరు ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం మేరకు.. 2019 ఏప్రిల్ 18న పుంగనూరు మండలం, మేలుందొడ్డి గ్రామంలోని ఓ బాలికను మంగళం కాలనీ సమీపంలోని నల్లరాళ్ళగంగమ్మ గుడి సమీపంలో ఒక చెట్టు కిందకు తీసుకొని వెళ్లి అత్యాచారం చేసిన కేసులో నిందితుడు పి కళ్యాణ్ కు ఇరవై ఏళ్ల జైలు శిక్ష, రూ. ఐదువేలు రూపాయల జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి యం శంకర్ రావు సంచలన తీర్పు ఇచ్చారు. పుంగనూరు మండలం ఉలవలదిన్నె గ్రామానికి చెందిన నిందితుడు పూజారి కళ్యాణ్ 2019లో బెంగళూరు నుండి ఇంటికి వస్తూ పోతూ ఉండి, మేలుం దొడ్డి గ్రామం, రాణి ప్రమీల నగర్‌లో నివసించే ఒక బాలికతో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఆ సమయంలో ఆ బాలిక 8వ తరగతి చదువుతోంది. కాలక్రమేణా అతడు బాలికను నల్లరాళ్ల గంగమ్మగుడి సమీపంలో ఉన్న ఒక చెట్టు కిందకు పిలుచుకొని వెళ్లి 'పెళ్లి చేసుకుంటాను' అని నమ్మించి ఆమెతో శారీరకంగా కలిసేవాడు. 2019 ఏప్రిల్ 18న 'బెంగళూరు చూపిస్తాను' అని మాయమాటలు చెప్పి, ఆమె చదువుతున్న పాఠశాల వద్ద నుండి బాలికను తీసుకెళ్లి బెంగళూరులో అద్దె ఇంట్లో ఉంచి మళ్లీ శారీరకంగా అనుభవించాడు. బాలిక తల్లి 2019 ఏప్రిల్ 4న మధ్యాహ్నం 4 గంటల సమయంలో తమ కూతురు కనిపించడం లేదని పుంగనూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ అరుణ్ కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులకు అందిన సమాచారం ఆధారంగా బెంగళూరులో బాలికను గుర్తించి 2019 ఏప్రిల్ 23న పుంగనూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణలో బాలిక ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా, మిస్సింగ్ కేసును వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాలికను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆ సమయంలో బాలిక ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.విచారణను అప్పటి పలమనేరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎం యుగంధర్ బాబు స్వీకరించారు. ఆయన 2019 ఏప్రిల్ 23 సాయంత్రం 4.30 గంటల సమయంలో నిందితుడు పి కళ్యాణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ పూర్తి కావడంతో చిత్తూరు ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి ఎం. శంకర్ రావు మంగళవారం నిందితుడు పి కళ్యాణ్ కు 20 ఏళ్లు జైలు శిక్ష, ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ

### వ్యక్తి మృతి

**ప్రజాశక్తి -యాదమరి:** గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదమరి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..లక్ష్మయ్య కండ్రిగ ఎంపీపీ స్కూల్ ముందు ఉదయం 6.15 గంటల సమయంలో చిత్తూరు బెంగళూరు హైవే వద్ద బెంగళూరు నుండి చిత్తూరు వైపు వచ్చే రోడ్డులో ఒక వ్యక్తి , కుక్కలపల్లి చెరువు వైపు నుండి స్కూల్ వైపు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ ఆ వ్యక్తి ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. ఈ వ్యక్తి వయసు సుమారు 55 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. అతని ఆనవాళ్లు ఇంతవరకు తెలియ రాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాదమరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గడ్డూరు కాలనీలో దొంగతనం

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దొంగతనం చేశారు. కాలనీలో నివాసముంటున్న అక్బర్ కుటుంబం ఆదివారం ఉదయం బెంగుళూరుకు వెళ్లి మంగళవారం ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి 32 గ్రాముల బంగారు నగలు, రూ.36 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

## మహిళ అదృశ్యం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మహిళా మిస్సింగ్ కేసు నమోదు అయింది. సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు చిత్తూరు నగరంలోని చావిడి వీధికి చెందిన బ్రహ్మయ్య ఆచారి కుమార్తె దివ్య శ్రీ (22) మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి కనిపించకుండా పోయిందని ఈ మేరకు దివ్య తండ్రి బ్రహ్మయ్య ఆచారి టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చెరువులో గుర్తు తెలియని మృతదేహం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** చిత్తూరు పట్టణం ఆర్టీసీ బస్టాండు వెనుక భాగంలో ఉన్న చెరువులో మంగళవారం మధ్యాహ్నం సుమారు 02.30 గంటల సమయంలో ఒక మగ వ్యక్తి చనిపోయి నీటిలో తెలియాడుతూ కనిపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు.. ఆ వ్యక్తి మొహం గుర్తించడానికి వీలుపడలేదని, తని శరీరాన్ని పరిశీలించగా వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని కనుగొన్నామన్నారు. చామన చాయ రంగు కలిగి ముఖం పూర్తిగా కుళ్లి పోయిందని తెలిపారు. నలుపు రంగు జీన్స్ ప్యాంటు, పసుపు రంగు రౌండ్ నెక్ నెక్ టి షర్టు ధరించి రెండు చేతుల భుజాలకి పూర్తిగా డిజైన్ టాటు వేయబడి వుందన్నారు. కుడి చేతిపై ఎఎన్‌యు అనే పేరు పచ్చబొట్టు కలిగి, కాళ్ల చేతులు పూర్తిగా పాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం వుందని తెలిపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకుని పరిశీలించామని చిత్తూరు వన్ టౌన్ పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. ఇతని ఆచూకీ తెలిస్తే వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నెంబర్. 08572234100, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చిత్తూరు వన్ టౌన్ పిఎస్ 9440796707 కు తెలపాలని వన్ టౌన్ సిఐ ఉమామహేశ్వర తెలిపారు.

## తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

**ప్రజాశక్తి- పలమనేరు :** పలమనేరు జాతీయ రహదారిపై గంగవరం ఫ్లైఓవర్ వద్ద మంగళవారం 9.30 గంటల సమయంలో సర్వీస్ రోడ్డులో పెద్ద గుంతలో వాహనం వెనక చక్రం పూర్తిగా తగులు కొని కూరుకు పోయింది. డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని ఆపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతపురం నుండి చెన్నై మార్కెట్ కు కూరగాయల లోడు తో వెళ్తున్న బొలెరో వాహనం సర్వీసు రోడ్ లో ఎక్కువ గా నీరు నిలువ ఉండడంతో గుంతలు కనిపించకపోవడంతో బొలెరో వాహనం సర్వేస్ రోడ్ లో అడ్డంగా వాలి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ రహదారుల్లో గుంతలు తెలియక డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి అధికారులు భారీ వర్షం వల్ల రోడ్లు విపరీతంగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలుగా మారినాపూడ్చకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి . ఇదే చోట గతంలో కూడా నాలుగైదు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు ఈ భారీ గుంతలను పూడ్చి, ప్రమాదకర ప్రదేశాలలో ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.